www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025

5

ఏలూరు



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఏలూరు : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలు సంబంధించిన అర్జీలు మొత్తం 39 స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత పోలీసులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే 1930కి సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరగాళ్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా స్మార్ట్‌గా వ్యవహరించాలని, మీ చుట్టుపక్కల వారికి కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరైన ఫిర్యాదుదారుల కోసం భోజన సదుపాయాలను శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఎన్నికలా.. కమిటీలా..!

సహకార సంఘాల ఎన్నికలపై కొనసాగుతున్న ఉత్కంఠ
త్రిసభ్య కమిటీలపై కూటమి నాయకుల ఆశలు
రెండు జిల్లాల్లో 281 సహకార సంఘాల పరిధిలో పదవుల ఆరాటం
వచ్చే జూన్, జులైలో ఎన్నికలకు వెళ్లే యోచనలో ప్రభుత్వం
కంప్యూటరీకరణ పూర్తిచేసి ముందుకెళ్లేందుకు ప్రణాళిక
త్రిసభ్య కమిటీలు వేస్తే వ్యవస్థ గాడి తప్పనున్నట్లు అంచనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక ముందుగా త్రిసభ్య కమిటీలను నియమిస్తారా అన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. సహకార వ్యవస్థలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే మాత్రం ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. వచ్చే జూన్, జులైలో ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో ఇన్‌ఛార్జుల పదవీకాలం ముగిసిన తర్వాత వారిని మరో ఆరు నెలలు జూన్ వరకూ పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు అందుకు అద్దం పడుతున్నాయి. సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలను నియమించనున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతుండడంతో కూటమి పార్టీల్లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పదవుల కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుపుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 రెండు జిల్లాల్లో మొత్తం 281 వరకూ సహకార సంఘాలు ఉన్నాయి. ప్రతి సహకార సంఘానికీ ముగ్గురు సభ్యుల కమిటీని నియమిస్తే దాదాపు 850కి పైగా రాజకీయ పదవులు దక్కే అవకాశం ఉంటుంది. ముగ్గురు సభ్యుల్లో ఒకరు ఛైర్మన్‌గా కొనసాగుతారు. దీంతో పదవుల కోసం నాయకులంతా తెగ ఆరాట పడుతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల టిడిపి, జనసేన మధ్య పదవుల పంపకం సైతం పూర్తయినట్లు సమాచారం. నీటి సంఘాల ఎన్నికల సమయంలో ఈ ఒప్పందం జరిగినట్లు చెబుతున్నారు. నీటి సంఘాల్లో పదవులు పొందని పార్టీ నాయకులకు సహకార సంఘాల్లో అవకాశం ఇచ్చే విధంగా చర్చలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల పదవుల పీటముడులు వీడక సిగపట్లు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. సహకార సంఘాలకు సంబంధించి ప్రభుత్వం సాగదీత ధోరణిపై నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



కాళ్ల : యండగండి సొసైటీ

ఎన్నికలవైపే ప్రభుత్వం మొగ్గు?

సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి ఏళ్లు గడిచిపోతుంది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించింది. వీటి గడువు 2018 జనవరితో ముగిసింది. అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అప్పటి పాలకవర్గాలనే పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2019 జులై వరకూ ఏడాదిన్నరపాటు ఇవి కొనసాగాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా త్రిసభ్య కమిటీ పేరుతో ఒకరిని ఛైర్మన్, ఇద్దరిని సభ్యులుగా నియమించి ముందుకు సాగింది. దీంతో దాదాపు ఏడేళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ముందుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. వచ్చే మేనాటికి కంప్యూటరీకరణ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కంప్యూటరీకరణ పూర్తయితే ఓటర్లు ఎంతమంది అనేదానిపై పూర్తి స్పష్టత వస్తుంది. ఇకపైనే వంటివి చేస్తుండడంతో గతంలో మాదిరిగా బినామీ తరహా ఓటర్లు ఉండే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో త్రిసభ్య కమిటీలను నియమిస్తే రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు నచ్చిన వారిని బోగస్ ఓటర్లుగా చేర్చే అవకాశం ఉంటుందని, కాబట్టి కంప్యూటరీకరణ పూర్తిచేసేనా నేరుగా ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే వచ్చే జూన్ వరకూ ఇన్‌ఛార్జులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెబుతున్నారు. త్రిసభ్య కమిటీలను నియమించే ఆలోచన ప్రభుత్వానికి ఉండి ఉంటే డిసెంబర్‌లో ఇన్‌ఛార్జుల పదవీకాలం ముగిసినప్పుడే చేసి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమిలోని పార్టీల నాయకుల ఒత్తిడి మేరకు త్రిసభ్య కమిటీలంటూ చెబుతూ బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే జూన్, జులైలో సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

పిజిఆర్ఎస్‌లో 232 అర్జీల స్వీకరణ

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) ద్వారా స్వీకరించిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ వెట్రిసెల్వి ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు 232 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన అర్జీలను వివిధ శాఖల జిల్లా అధికారులు తక్షణం స్పందించి వారి సిబ్బందితో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా అధికారులు అర్జీలో పొందుపర్చిన అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఏలూరు శ్రీరామనగర్‌కు చెందిన కె.పార్వతి ఆధార్ కార్డు లేదని వృద్ధాప్య పింఛన్ తనకు ఇవ్వడం లేదని, ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించి వృద్ధాప్య పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. జంగారెడ్డిగూడెం పేరంపేటకు చెందిన వికలాంగుడు బి.శంకరరావు తనకు మూడు చక్రాల సెకిల్‌ను ఇప్పించాలని కోరాడు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

1 నుంచి ఉద్యోగులు హెల్మెట్ ధరించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే సాధారణ సెలవుగా పరిగణించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు అనుసరించి ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ద్విచక్రవాహనం కలిగిన ఉద్యోగులు హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరై అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. వాహన చోదకుల నిర్లక్ష్యం, ఇతర కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇప్పటికే ఈ విషయంపై అన్నిస్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. హెల్మెట్ ధారణపై మరింత విస్తృత చర్యల్లో భాగంగా తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రజలతోపాటు అధికారులు కూడా తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యాలయాల్లో ఉద్యోగులందరూ విధిగా హెల్మెట్ ధారణపై సూచించిన మేరకు రావాల్సి ఉంటుందన్నారు. కళాశాలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రాకపోతే నో ఎంట్రీ అని స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

1 నుంచి సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ

పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఫిబ్రవరి 1 నుంచి మూడో తేదీ వరకూ సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ నెల్లూరులో పెద్ద ఎత్తున జరగనున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి చెప్పారు. సోమవారం ఏలూరు పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం రాష్ట్ర మహాసభ పోస్టర్లను పార్టీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. మహాసభ ముగింపుగా ఫిబ్రవరి 3వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర మహాసభ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రచార జాతాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న ప్రచార జాతా జిల్లాలో ఈ నెల 30వ తేదీన పర్యటిస్తుందని, ఆ జాతా ఒకటో తేదీకి నెల్లూరు చేరుకుంటుందని వివరించారు. సిపిఎం రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడమే కాకుండా ప్రజా ఉద్యమాల నిర్వహణకు దిశా దశ రూపొందించడం జరుగుతుందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తి పునరావాసం, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతోందని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, యువజనులు, విద్యార్థులు, మహిళల సమస్యలపై, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సిపిఎం అనేక ప్రజా ఉద్యమాలు చేస్తోందన్నారు. ఆ ఉద్యమాలను ప్రజలందరూ బలపర్చాలని కోరారు. సిపిఎం రాష్ట్ర 25వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నేతలు


జిల్లాలో రూ.98 కోట్లతో రోడ్ల మరమ్మతులు

రూ.15 కోట్లతో శనివారపుపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు

రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి జనార్ధనరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో రూ.98 కోట్లతో 174 రోడ్ల మరమ్మతు పనులను చేపట్టామని జరిగిందన్నారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి జనార్ధనరెడ్డి వెల్లడించారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక రెవెన్యూ అతిథి గృహంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని రాష్ట్ర, జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనుల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి), దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ.1080 కోట్లతో 21,220 కిలోమీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటికే 12,724 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు మెరుగైన రహదారులు అందించాలనే లక్ష్యంతో రూ.1,080 కోట్ల నిధులతో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటికే 65 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. రోడ్ల మరమ్మతులను వేగంగా పూర్తిచేసే క్రమంలో నాణ్యత విషయంలో రాజీలేకుండా థర్డ్ పార్టీ ద్వారా విచారణ చేయనున్నామన్నారు. ఎక్కడైనా నాణ్యతా ప్రామాణాలు లోపిస్తే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్‌హెచ్ ఎ1, మోర్త ద్వారా మొత్తం 133 ప్రాజెక్ట్‌ల్లో రూ.77 వేల 967 కోట్లతో 3,463 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మరమ్మతులు చేయలేని స్థితిలో ఉన్న రోడ్ల స్థానంలో సిఎం సూచన మేరకు రూ.1,149 కోట్ల వ్యయంతో కొత్త రోడ్లను నాబార్డు నిధులతో చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. రోడ్లపై ముళ్లకంపలను తొలగించి రూ.33 కోట్ల వ్యయంతో 23,521 కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామన్నారు. జిల్లాలో రూ.98 కోట్లతో 174 రోడ్ల మరమ్మతు పనులను చేపట్టామన్నారు. ఇవి కాక వరదల్లో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పెదవాగు ప్రాజెక్ట్ నుంచి వరద నీటి మూలంగా పోయిన రహదారుల మరమ్మతులకు, నూజివీడులో పెద్దచెరువు గండి వల్ల పాడైన రహదారి మరమ్మతులకు రూ.నాలుగు కోట్లు మంజూరు చేశామన్నారు. సిఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.43.05 కోట్లతో రెండు పనులు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ ట్రైబ్ కాంపోనేట్ కింద రూ.34.50 కోట్లతో బూర్గంపాడు- అశ్వారావుపేట రహదారి పనులు సాగుతున్నాయన్నారు. ప్రధాన రహదార్ల మరమ్మతుల కింద ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, సిద్ధాంతం-పెదఎడ్లగాడి, భీమవరం-గుడివాడ మూడు ప్రధాన రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. సిఎం ఆదేశాల మేరకు రూ.15 కోట్లతో ఏలూరు శనివారపుపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఆమోదం పొందే దిశలో ఉన్నాయన్నారు. నూజివీడు బైపాస్ కోసం భూసేకరణ జరుగుతుందని, బైపాస్ నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేశామన్నారు. రైల్వే ఎల్‌సి నెంబర్ 351 వద్ద ఆర్‌ఒబి నిర్మాణానికి రూ.40 కోట్లతో పరిపాలన మంజూరి దశలో ఉందన్నారు. రాష్ట్రం, జిల్లాలో చేపట్టిన గుంతల రహిత రహదారుల నిర్మాణాలను ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ జి.జాన్‌మోషే, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహశీల్దార్ జివి.శేషగిరి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జనార్ధనరెడ్డి

పేదల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలోని పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తోందని, ప్రతి పేదవాడికీ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడులో క్యాంపు కార్యాలయంలో సోమవారం 16 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6.55 లక్షల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి పేదవాడికీ తమ ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందన్నారు. ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా వైద్య చికిత్సలు చేయించుకున్న నిరుపేదలకు సంబంధిత వైద్య ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిస్తున్నామన్నారు. నూజివీడు మండలంలో 8 మందికి 4 లక్షల రూపాయలు, చాట్రాయి మండలంలో ఆరుగురికి 2.16 లక్షలు, ఆగిరిపల్లిలో ఇద్దరికి 57 వేల రూపాయలు చొప్పున అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు అక్కినేని చందు, ముసునూరు రాజాబాబు, కాపా శ్రీనివాసరావు, పల్లి నాగరాజు, గొల్లి లక్ష్మీదేవి, శివలక్ష్మి, నాగమణి, పాశం నాగబాబు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి పార్థసారధి

దళిత నాయకుల అరెస్టు దుర్మార్గం

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దళిత నాయకుల అరెస్టు దుర్మార్గమని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. మండలంలోని ముప్పనవారిగూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మొదట పీఠిక చదవాలని ఆలోచనతో వెళ్తున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రిని, రాష్ట్ర కమిటీ సభ్యులను, నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజకీయాలను తీసుకొచ్చేందుకు బిజెపి కుట్రలు చేస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనలతో కేంద్ర ప్రభుత్వం మత విధ్వంసాలు, ముస్లిం, క్రైస్తవులు, దళితులపై దాడులు చేసే ఆలోచనలకు సిద్ధపడుతుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ప్రధానమంత్రి వెనకేసుకొచ్చారన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రి పదవి తొలగించాలని, దళిత నాయకులను అరెస్టు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎ.సోమరాజు, విజయ్, విక్రం, శివ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నేతలు

నకిలీ స్వామీజీ అరెస్టు

రూ.80 వేల నగదు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్, చాట్రాయి

నకిలీ స్వామీజీగా చలామణి అవుతూ పూజలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని చాట్రాయి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.80 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు సిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ వివరాలు వెల్లడించారు. చాట్రాయి మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో గత నెల 16వ తేదీన ఒక వ్యక్తి మృతి చెందాడు. నకిలీ స్వామీజీగా చలమణి అవుతున్న వ్యక్తి గ్రామంలోని ఆ ఇంటికి వెళ్లి మీ అల్లుడికి చేతబడి చేయటం వల్ల చనిపోయాడని, ఇంకా మీ ఇంటిని పట్టిన శని వదిలిపోలేదని, మీ కుమారుడు కూడా చనిపోతాడని భయపెట్టి మోసపూరిత మాటలు చెప్పాడు. శని వదిలిపోవాలంటే విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేసి తాయిత్తులు పంపిస్తారని, అందుకు డబ్బులు ఖర్చవుతాయని చెప్పాడు. అతని మాటలు నమ్మిన వారు రూ.61 వేలకు నకిలీ స్వామీజీకి ఇచ్చారు. అప్పటినుంచి అతను మళ్లీ వారికి కనిపించకుండా పరారయ్యాడు. గత ఎనిమిది నెలల క్రితం నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో కూడా ఇదేవిధంగా మాయమాటలు చెప్పి ఒక కుటుంబం నుంచి రూ.26 వేలు కాజేశాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు సిఐ రామకృష్ణ చాట్రాయి మండలంలో వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చాట్రాయి గ్రామంలోని పోలవరం వెళ్లే రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోలీసు సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీలు చేస్తుండగా పోలవరం గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న నకిలీ స్వామీజీ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. హెడ్‌కానిస్టేబుల్ విజయభాస్కర్, కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరావు, విష్ణుకుమర్ అతడిని వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.80 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అతను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట గ్రామపంచాయతీ పెరియాగూడేనికి చెందిన తోరపాటి బాలయ్యగా గుర్తించారు. ప్రజలు ఇలాంటి నకిలీ స్వామీజీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డిఎస్‌పి తెలిపారు. బాలయ్యను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరిచిన నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణను, చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణను డిఎస్‌పి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి ప్రసాద్

చెరువులను పరిశీలించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని అన్నవరం, కొన్నంగుంట గ్రామాల్లో ఉన్న చెరువులను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. కొన్నంగుంటలో చెరువులను, ఆయకట్టు రైతులు పండిస్తున్న పంటలను, నీటి నిల్వ శాతాన్ని బృందం సభ్యులు పరిశీలించారు. కొన్నంగుంట చెరువు అభివృద్ధి చేసేందుకు ఎపిఐఐ ఎటిపి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు నిధులతో చెరువును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి పనుల వల్ల ఉపయోగాలను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో వరి పంటను, రబీలో మొక్కజొన్న పైరును వేస్తున్నట్లు బృందానికి రైతులు తెలిపారు చెరువుల అభివృద్ధి కాకముందు ఎకరాకు ఎవరికీ 25 నుంచి 26 బస్తాలు దిగుబడి వచ్చేదని, చెరువులు అభివృద్ధి జరగటం వల్ల ఇప్పుడు ఎకరాకు 35 నుంచి 36 బస్తాల దిగుబడి వస్తుందని బృందానికి రైతులు తెలిపారు. రెండో పంటగా ఆరుతడి పైరు మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు, మొక్కజొన్న 38 నుంచి 48 క్వింటాల దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. అనంతరం రైతుల చర్చా గోష్టి వద్ద సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు భూమిలో పోషకాలను పెంపొందించడానికి అవలంభించే సాగు పద్ధతులను ముగ్గురూపంలో వేసిన పటాన్ని బృందం పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐఎటిపి సభ్యులు సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నీషియన్ రేవతి, వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి, ఆర్టికల్చర్ అధికారి ఆర్.హేమ పాల్గొన్నారు.



కార్తీక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కార్తీక్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

వివిధ ప్రాంతాల్లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ చూపిన ఎ.కోమల్ కార్తీక్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయా ప్రాంతాల్లోజరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని మెడల్స్ పొందిన ఎ.కోమల్ కార్తీక్ కలెక్టర్ కె.వెట్రిసెల్విని స్థానిక కలెక్టర్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హిమాచల్ ప్రదేశ్ ఈటా నగర్‌లో గత డిసెంబరు 28 నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకు జరిగిన జూనియర్ నేషనల్ ఛాంపియన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 310 కేజీల విభాగంలో సరికొత్త జాతీయ రికార్డును కార్తీక్ సాధించారు. అదే విధంగా 96 కేజీల విభాగంలో సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్‌ను కూడా సాధించారు. పంజాబ్‌లో లవ్ లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో జనవరి 15 నుంచి 18 వరకు నిర్వహించిన ఆలిండియా యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో సిల్వర్ మెడల్‌ను సాధించారు. అదే విధంగా ఖత్తర్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి 25 వరకు జరిగిన జూనియర్ ఎషియన్ ఛాంపియన్ షిప్ 96 కేజీల విభాగంలో కార్తీక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ ఎ.శ్రీనివాసరావు కుమారుడు ఎ.కోమల్ కార్తీక్ మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోమల్ కార్తీక్‌ను ప్రోత్సహించిన డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఎం.రమేష్ బాబు, స్టేట్ కార్యదర్శి టి.దీనషబాబు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్యలను కలెక్టర్ అభినందించారు.

జిల్లా స్థాయిలో హిమశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రయివేట్ విద్యా సంస్థల (అపుస్మా) ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల చదరంగం పోటీల్లో ఉంగుటూరు మండలం నారాయణపురం ఉషోదయ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని శీతాల హిమశ్రీ ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుణ్ణం బుల్లెబ్బాయి తెలిపారు. హిమశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో మహేశ్వరి ప్రతిభ

టి.నరసాపురం : జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.మహేశ్వరి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎవి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో ఏలూరులోని సిద్ధార్థ స్కూల్లో నిర్వహించిన బాలోత్సవంలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో సుమారు పది వేల మంది విద్యార్థులు పాల్గొన్నగా మహేశ్వరి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. మహేశ్వరినితో పాటు ప్రోత్సహించిన ఉపాధ్యాయులు శరదాభాయిని ఎంఇఒలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణిలు అభినందించారు.

కొల్లేరును మూడో కాంటూర్‌కు కుదించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

కొల్లేరును మూడోకాంటూర్‌కు కుదించాలని సిపిఎం నాయకులు కోరారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల సమావేశం గవర సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ఐదో కాంటూర్ నుంచి మూడో కాంటూర్‌కు కుదిస్తామని, కొల్లేరు ప్రాంతాన్ని కాపాడుతామని, పరిరక్షిస్తామని రెండు దశాబ్దాల కాలం నుంచి కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు చెప్పుకొస్తూ తీర్మానాలు చేసి గాలికి వదిలేస్తున్నారన్నారు. కొల్లేరులో అక్రమంగా తవ్వుతున్న చెరువులను అరికట్టాలన్నారు. కొల్లేరు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెంగలిరెడ్డి మోహన, లావేటి సోంబాబు, కామారు రాజు, కంచం వరప్రసాద్, కముల నాని,రావేటి చంద్రరావు పాల్గొన్నారు.

బివి.శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నారాయణపురం మహాత్మ గాంధీ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బివి.శ్రీనివాస్ ఎడ్యుకేషన్‌లో గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా సోమవారం స్థానిక నరసింహారావుపేటలో నూతనంగా నెలకొల్పిన శరవణ జూనియర్ కళాశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. అలాగే గత 24 ఏళ్లుగా ఇంటర్మీడియట్ విద్యా రంగంలో విశిష్ట సేవలందిస్తున్నందుకు శరవణ కళాశాల యాజమాన్యం తరుపున సెక్రటరీ, కరెస్పాండెంట్ గొట్టిపు సుబ్రహ్మణ్యేశ్వరరావు, పలువురు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం శరవణ జూనియర్ కళాశాల డైరీని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి బి.ప్రభాకరరావు ఆవిష్కరించారు. ఉత్తమ విద్యా సంస్థగా శరవణ జూనియర్ కళాశాల ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్, హెచ్చరి శ్రీనివాస్, రిటైర్డ్ అధ్యాపకులు ఎస్.శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ సిపియు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి నీలపాల వెంకటేశ్వరరావు ధర్మపత్నిలక్ష్మి సుమారు రూ.25 వేల విలువైన కంప్యూటర్ సిపియును అందించారు. అలాగే పాఠశాలకు అవసరమైన మరికొన్ని వస్తువులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎల్‌విఎస్.నాగేంద్రరావు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ కొయ్యూరి రాము, ఎస్ఎంసి కమిటీ మెంబర్ పిన్నిబోయిన రామకృష్ణ, గ్రామ పెద్దలు నీలపాల రాట్నలురావు పాల్గొన్నారు.

పాత ప్రభుత్వం పేరుతో మరణ ధ్రువీకరణ పత్రం జారీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం పంచాయతీలో మరణ ధ్రువీకరణ పత్రం జారీలో పంచాయతీ సిబ్బంది పొరపాటు వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా వైసిపి ప్రభుత్వం పేరుతో బాధితులకు పత్రం జారీ అయింది. దీంతో మృతుని కుటుంబీకులు ప్రశ్నించడంతో ఆ ధ్రువపత్రాన్ని వెనక్కి తీసుకుని కొత్త సర్టిఫికెట్ సెక్రటరీ జారీ చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రమైన టి.నరసాపురానికి చెందిన టిడిపి నాయకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మరణ ధ్రువీకరణ పత్రం కోసం కుటుంబీకులు పంచాయతీలో దరఖాస్తు చేశారు. అయితే కంప్యూటర్ ఆపరేటర్ ప్రింట్ ఇచ్చిన సర్టిఫికెట్‌లో నవరత్నాల పేరుతో జగన్ ఫొటో ఉంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ స్పందించి కంప్యూటర్ ఆపరేటర్ పొరపాటున చూసుకోకుండా పాత ప్రభుత్వం సర్టిఫికెట్ ప్రింట్ ఇచ్చారని, వెంటనే ఆ ప్రింట్ సర్టిఫికెట్ కాన్సిల్ చేసి మృతుని కుటుంబానికి అందించామని తెలిపారు. జగన్ బొమ్మతో కూడిన మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందించిన విషయంపై ఎంపిడిఒ జి.మణికుమారి కార్యదర్శిని వివరణ కోరినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో వలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ వలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో గిరిజనులు బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. గ్రామాలకు రహదారుల సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలస గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కుక్కునూరు తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, జోగేశ్, సోమయ్య, సోడే రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కొబ్బరి మొక్కల పెంపకం

భీమడోలు ఎపిఒ పద్మ

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ చట్టం కింద మండలంలో గుర్తించిన పనులు మరింత వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యసాధనకు కృషి చేస్తున్నట్లు చట్టం భీమడోలు ఎపిఒ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సుమారు 4.81 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకు 3.86 లక్షల పని దినాలు మాత్రమే పూర్తయినట్లు తెలిపారు. లక్ష్య సాధనలో భాగంగా రానున్న కాలంలో ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన ఎక్కువ పని దినాలు కల్పించే పంట బోదెలు, ఫీడర్ ఛానల్స్ పూడికతీత పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీ కనీసంగా రూ.300 రావాల్సి ఉండగా, పూర్తయిన పనుల ఆధారంగా రూ.256 వరకు కూలి గిట్టుబాటు జరిగిందన్నారు. మండలంలో 15,360 జాబ్ కార్డులు చెలామణిలో ఉండగా 12,661 మంది పనుల్లో పాల్గొన్నారని, వీరిలో 401 మంది వంద పని దినాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. నూతన సవరణ మేరకు గతంలో 50 కుటుంబాలకు ఒక మేట్ ఉండేవారని చెప్పారు. ప్రస్తుతం 50 మంది కూలీలకు ఒక మేట్‌ను పెట్టామని తెలిపారు. మేట్ తన వంద దినాలు పూర్తి చేసుకునేంతవరకు ఒక్కొక్క కూలిపై రూ.మూడు వరకు కమిషన్ చెల్లిస్తామన్నారు. మేట్ తన వంద దినాలు చేసుకుంటే ఒక్కొక కూలిపై రూ.1.50 వరకు కమిషన్ చెల్లించనున్నట్లు తెలిపారు. భూగర్భజలాల పెంపు, గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ సరస్సుల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇదే తరహాలో ఇప్పటికే పొలసానిపల్లిలో ఒక అమృత్ సరస్సు సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. తాజాగా అమృత్ చెరువు ఏర్పాటు కనీసంగా 25 సెంట్లు తగ్గకుండా దాతల నుంచి సొంత భూములు గాని, ప్రభుత్వ భూమి కాని అందుబాటులో ఉండాల్సి ఉందన్నారు. దీనికి కొంతవరకు ప్రోత్సాహం లభించాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ చట్టం కింద ఉద్యానవన శాఖ సహకారంతో పొలం గట్లపై కొబ్బరి మొక్కల పెంపకానికి రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల వరకు దీని కింద మొక్కల కొనుగోలు, పెంపకం కోసం రూ.92 వేల వరకు రాయితీ లభిస్తుందన్నారు. ఎకరం విస్తీర్ణంలో 60 కొబ్బరి మొక్కలు పెంపకం చేయాల్సి ఉందన్నారు. ఆ తరువాత కొబ్బరి మొక్కల పెంపకం బాధ్యతను లబ్ధిదారులు తీసుకోవడంతో పాటు దానిపై వచ్చే ఫలసాయాన్ని లబ్ధిదారులు పొందవచ్చని తెలిపారు. ఈ తరహాలో తమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పొలసానిపల్లి, కురెళ్లగూడెం, అంబరుపేట గ్రామాల్లో పలువురు లబ్ధిదారులు కొబ్బరి చెట్ల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు.



కొబ్బరి మొక్కల పెంపకం యూనిట్

మధ్యవర్తిత్వంతో త్వరగా కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి) ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రిటైర్డ్ న్యాయమూర్తులకు, ఎంపిక చేసిన న్యాయవాదులకు, సోషల్ వర్కర్లకు ఐదు రోజుల శిక్షణా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. రాజీకి అవకాశమున్న కేసుల్లో కక్షిదారులను శాస్త్రీయంగా కౌన్సెలింగ్ నిర్వహించడం వల్ల కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చని, నేటి సమాజంలో చిన్నచిన్న గొడవలకు న్యాయస్థానాలను ఆశ్రయించడం వల్ల న్యాయస్థానాల్లో కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, దీనిని అధిగమించడానికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారు మధ్యవర్తిత్వాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, కక్షి దారులకు ఏ విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాలనే అంశంపై న్యాయవాదులకు, సోషల్ వర్కర్లకు తర్ఫీదు ఇచ్చే బృహత్ కార్యక్రమాన్ని చేపట్టారని, ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మొదటిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను ఎన్నుకోవడం హర్షణీయమని, న్యాయవాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కక్షిదారులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, ఫోక్సో స్పెషల్ కోర్ట్ జడ్జి ఎస్.ఉమాసునంద, పర్మినెంట్ లోక్ ఆదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఉత్తమ సేవకులకు అభినందనలు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ సేవల పురస్కారం పొందిన డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌లకు సోమవారం పోలవరం మండల ప్రముఖులు అభినందనలు తెలిపారు. పోలవరం సబ్ డివిజన్, సర్కిల్, మండల పరిధిలో వారు అందించిన సేవలకు జిల్లాస్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణమని ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.

మండవల్లి : విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమమైన సేవలందించినందుకు మండవల్లి విద్యుత్ శాఖకు చెందిన పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. మండవల్లికి చెందిన విద్యుత్ శాఖ ఎఇ జి.రామకృష్ణ, జూనియర్ ఇంజినీర్ ఎం.సత్యనారాయణ చింతపాడు జెఎల్ఎం 2 ఎస్.కరుణామయుడు మెరిట్ అవార్డులను పొందారు. మండవల్లి మండలంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్తును అందించడంలో ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మచిలీపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ పి.సత్యానందం చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. విద్యుత్ శాఖ మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు సహచర ఉద్యోగులు వారికి అభినందన తెలిపారు. విద్యుత్ శాఖలో మరింత నిబద్ధతతో పనులు నిర్వహించి వినియోగదారులకు మరిన్ని సేవలందించి మరిన్ని ప్రశంసలు పొందాలని పలువురు ఆకాంక్షించారు.

చింతలపూడి : పనిలో సమర్థతను చూపించి చింతలపూడి మండలానికి మంచి పేరు తీసుకొచ్చిన తహశీల్దార్ కార్యాలయం సిబ్బందిని, జూనియర్ అసిస్టెంట్ కోరాడ నరసింహను, కంప్యూటర్ ఆపరేటర్ సువర్ణను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అభినందించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న చింతలపూడి మండల రెవెన్యూ సిబ్బంది ఎంఎల్ఎను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

కుక్కునూరు : కుక్కునూరు మండల పరిధిలోని వింజరం విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్.వెంకటేశ్వరరావు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ గ్రామ రెవెన్యూ అధికారిగా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆయనను తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకుల సమక్షంలో తహశీల్దార్ రమేష్‌బాబు అధ్యక్షతన సోమవారం సన్మానించారు.



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

భీమడోలు : జిల్లా స్థాయిలో గ్రామ సచివాలయ ఉత్తమ వ్యవసాయ సహాయకులుగా భీమడోలు మండలం సూరప్పగూడెం రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు డి.(కె).షైలభాను ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా షైలభాను ప్రోత్సాహకాన్ని స్వీకరించారు. ఈ మేరకు సోమవారం సూరప్పగూడెం రైతు సేవ కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు అవార్డు గ్రహీతను అభినందించారు.

ముదినేపల్లి : ఉత్తమ గ్రామ రెవెన్యూ అధికారిగా ఏలూరులో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న గురజ గ్రామ రెవెన్యూ అధికారి కాటూరి కిషోర్‌కు సోమవారం ఘనంగా సన్మానించారు. మండల విఆర్ఒల అసోసియేషన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ జెఎస్.సుభాని, ఆర్ఐ రాజశేఖర్, మండల విఆర్ఒలు, విఆర్ఎలు కిషోర్‌కు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి అభినందించారు.

హాస్టల్‌లో ఇన్వెర్టర్ కొనుగోలుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సూచించారు. బోయగూడెం వద్ద ఉన్న బాలికల హాస్టల్‌లో కరెంట్ పోయినప్పుడు విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని, ఇన్వెర్టర్ ఏర్పాటు చేయండని ఆకస్మికి తనిఖీకి వెళ్లిన ఎంఎల్ఎను వార్డెన్ కోరారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద టిడిపి చింతలపూడి నాయకులు ఇసుక శ్రీను ఎంఎల్ఎ సమక్షంలో హాస్టల్ వార్డెన్ పిహెచ్.స్వర్ణలతకు ఇన్వెర్టర్ కొనుగోలు నిమిత్తం రూ.20 వేలు అందించారు.

బాలోత్సవంలో అన్నేవారిగూడెం విద్యార్థుల ప్రతిభ

పలువురి అభినందన

ప్రజాశక్తి - భీమడోలు

హేలాపురి బాలోత్సవంలో పాల్గొన్న అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 45 అంశాల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో అన్నెం నాగ సుబ్రహ్మణ్యం అనే విద్యార్థి గుర్రం జాషువా పద్య పఠన పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారని తెలిపారు. ఇతనితో పాటు కోలాటం, మట్టితో బొమ్మలు తయారీ, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం, ఇంగ్లీష్ రైమ్స్ పఠనం, ఇతర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందించారని తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను సర్పంచి నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పి.శ్రీనివాసరావు, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

'అధికారంలోకొచ్చేందుకు సహకరించిన యువగళం'

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ఫలితాలు సహకరించాయని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంతో పాటు, చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన దావోస్ పర్యటన విజయవంతమైందని అభినందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసిలు కరణం పెద్దిరాజు, చింతల వాసు, భీమడోలు ఎఎంసి మాజీ ఛైర్మన్ దూసనపూడి పుల్లయ్య, మాజీ ఎంపిపి ఎం.రామతులసమ్మ యుగంధర్, ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పవర్‌పేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు వందనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి : గురుబట్లగూడెం సెంటర్‌లో బోసుబొమ్మ విగ్రహానికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి ఆరో తేదీన నారా లోకేష్‌తో చర్చలున్నాయని, చింతలపూడి అభివృద్ధికి ఇండస్ట్రీలు తీసుకురావటానికి కృషి చేస్తానని తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో జరుగుతున్న పశువైద్య ఆరోగ్య ఉచిత శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీల పశువైద్యులు యు.క్రాంతికుమార్, ఆరేపల్లి రామకృష్ణ కోరారు. ముదినేపల్లి డిస్పెన్సరీ పరిధిలో కాకరవాడ, పెదగొన్నూరు డిస్పెన్సరీ పరిధిలో చిగురుకోట, చినకామనపూడి గ్రామాల్లో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ముదినేపల్లి డిస్పెన్సరీ పరిధిలో ఎనిమిది రోజులుగా జరిగిన శిబిరాల్లో 400 పశువులకు వైద్యం చేయగా వెయ్యి పశువులకు నట్టల నివారణ, జలగ మందు పంపిణీ చేశారు. 350 లేగ దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, బాహ్య పరాన్న జీవుల నివారణ, గోమార్ల మందు పంపిణీ, 1100 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు, టీకాల వేసినట్లు పశు వైద్యాధికారి క్రాంతికుమార్ తెలిపారు. అలాగే చినకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో జరిగిన పశు వైద్య ఆరోగ్య శిబిరంలో పది గేదెలకు కృత్రిమ గర్భధారణ, 17 గేదెలకు సూడి పరీక్షలు, 120 గేదెలకు నట్టల మందులు, 800 గొర్రెలకు నట్టలు నివారణ మందులు, 12 గేదెలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు పశువైద్యులు ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరాల్లో పశు వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, జ్యోతిబాబు, రవికుమార్, కాశీరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

ముసునూరు : మూగ జీవాలకు నట్టల నివారణ మందు వేస్తే ఆరోగ్యకరంగా ఉంటాయని టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర అన్నారు. మండలంలోని వలసపల్లి పశు వైద్య కార్యాలయంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసినట్లు వైద్యులు ఎం.వెంకటచైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చలసాని దామోదరరావు, నక్కనబోయిన సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాకేష్, పలువురు రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

భీమడోలు : వాహనదారులు సురక్షిత ప్రయాణం కోసం రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏలూరుకు చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పలువురు కోరారు. భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పాఠశాలకు చెందిన డ్రైవర్లు, సిబ్బందితోపాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శేఖరరావు, హజ్మీర, మధు, నరేంద్ర, ప్రజ్ఞ, కళ్యాణి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లునిండిన వారు వాహనాలు నడిపేందుకు లైసెన్సులను తీసుకోవాలన్నారు. అంతకు లోపు వయసు గల వారు వాహనాలను నడపరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. 60 ఏళ్ల నిండిన వాహన డ్రైవర్లు స్కూలు బస్సులను నడపరాదన్నారు. మద్యం తాగి వాహనాలను డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించాలని, భద్రత కోసం సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పశువులకు అందాల పోటీల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పాడి రైతులను ప్రోత్సహించేందుకు, ఆదుకునేందుకు పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడు, పశువులకు గుర్తింపు తెచ్చేందుకు అందాల పోటీలను నిర్వహించటం అభినందనీయమని పూళ్ల గ్రామ సర్పంచి దాయం సుజాత, మాజీ ఉపసర్పంచి పెద్దిరెడ్డి వెంకన్న అన్నారు. పశుసంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పూళ్ల పశు వైద్యులు మున్నంగి హరికృష్ణ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరం, లేగ దూడలకు అందాల పోటీలను పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎంఎం.పురం ఆవాస ప్రాంతంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు పశువైద్యశాలకు చెందిన సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్, పూళ్ల పశు వైద్యులు హరికృష్ణ ఆధ్వర్యంలో పశువుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచి ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ తరపున పాడి రైతులకు పశువుల మందులు, ఇతరాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన లేగ దూడల అందాల పోటీలకు పరిశీలకులు, ముఖ్యఅతిథిగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పెంటపాడు సిఇఒ డాక్టర్ జేసుదాసు హాజరయ్యారు. ప్రథమ బహుమతిని గురజాల ఆంజనేయులు, ద్వితీయ బహుమతిని కె.సెల్వరాజు, తృతీయ బహుమతిని రేగడపల్లి మల్లేశ్వరరావులకు చెందిన దూడలు గెలుచుకున్నాయి. నిర్వాహకులు వీటికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

29న పీసా కమిటీలకు పోలింగ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా రెండు దఫాలుగా కోరం లేక వాయిదా పడిన నాలుగు గ్రామాల పీసా కమిటీలకు ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రజా ప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీల్లో వార్షిక ప్రణాళిక రూపొందించడం కోసం మండలంలోని ప్రజా ప్రతినిధులు ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలకు ఒక రోజు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులందరూ తమ ఆధార్ కార్డులతో సకాలంలో శిక్షణకు హాజరవ్వాలని కోరారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి లేక పొట్ట చేత్తో పట్టుకుని వలసలు వెళ్తున్న గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం బికెఎంయు నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి రోజు కూలి రూ.700 ఇవ్వాలని కోరారు.

రావులపర్రులో జ్వరాలపై 'మీకోసం'లో ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రావులపర్రులో గత కొన్ని రోజుల నుంచి జర్వపీడితులు ఎక్కువగా ఉంటున్నారని సంబంధిత శాఖలు పట్టించుకోవడంలేదంటూ గ్రామానికి చెందిన గాది రమణ, పలువురు సోమవారం మీకోసంలో ఫిర్యాదు చేశారు. కచ్చ మురుగు బోదెలు పూడుకుపోయి దోమల వ్యాప్తి కారణంగానే జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. కాగా గత కొన్నిరోజుల నుంచి శానిటేషన్, బ్లీచింగ్, ఎబేట్ పిచికారీ చేయించామని ఇన్‌ఛార్జి కార్యదర్శి నేతల విజయకుమార్ చెప్పారు. పంచాయతీ నుంచి చేయించాల్సిన పారిశుధ్య పనులను పూర్తి చేసినట్లు కార్యదర్శి అంటున్నారు. సీజనల్ ఫీవర్లు, దగ్గు జలుబు వంటి చిన్న చిన్న రుగ్మతలు తప్ప డెంగీ తదితర జ్వరాలు ఉన్నట్లు తమ దృష్టికి ఏమీ రాలేదని కాగుపాడు పిహెచ్‌సి వైద్యాధికారి మానస చెప్పారు. అయినా మెడికల్ క్యాంపు పెట్టి గ్రామంలో ఇంటింటా సర్వే చేయిస్తామని డాక్టర్ తెలిపారు.